


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



*సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.*

*హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)*

*అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.*

# మాయాబజార్ -8

## (గత సంచిక తరువాయి)

వాళ్ళు ఆశ్చర్యంగా చూస్తుండగానే పాదరక్షలుపోయి తల్పంపై చేరుతాయి. –బయట సారథి హుషారుగా వస్తుంటాడు.

★★★

సారథి: శర్మా,శాస్త్రీ– తలుపు (తడతాడు) లోపల శాస్త్రి లేవబోతే శర్మ ఆపుతాడు. బయట——ఓ తానతందానా. తలుపు తియ్యండి. . తియ్యండయ్యా. తియ్యండయ్యా.——ఉహ్–దండం పక్కనపెట్టి దూరం నుండి పరుగునవచ్చి తలుపు నెట్టుతాడు. తలుపు భళ్ళున తెరుచుకుని దొర్లుకుంటూవెళ్ళి ఎదురుగోడకి జేరబడి కూర్చున్న శర్మ శాస్త్రిల ముందు వాలుతాడు.

శర్మ,శాస్త్రి: శివశివా శివశివా! –తల్పంవద్ద పెళ్ళిపెద్దలు చూసి నవ్వుకుని మాయమౌతారు.

శర్మ: ఓ సారథిగారా. పడ్డది తమరా బాబూ.

సారథి: పడ్డానూ–మొగ్గలేశాను.

శర్మ: అబ్బో అలాగా. లేవండి నాయనా.

సారథీ: అదేమిటి? గింబళీ అదీ వదిలేసి మూల కూర్చున్నారు?

శర్మ:ఆఁ–అది తమబోటి వారికి. దయచేయండి.–(ఇద్దరూ)– దయచేయండి.

–సారథి ఒళ్ళునొప్పులతో వంకర్లుపోతూ వెళ్ళి సంబరంగా తల్పంపై కూర్చుంటాడు: ఇదేమిటి? పడుకునే గిల్పంపైనా చెప్పులు పెట్టడం? మీకేమైనా మతుందా?

శర్మ,శాస్త్రి: మేం పెట్టలేదు.

సారథి : లేకపోతే వాటంతట అవే నడిచొచ్చాయా?

శర్మ,శాస్త్రి: ముక్తకంఠంతో–ఏమో మేం చూశామా? –సారథి విసుగ్గా చెప్పులు కిందపడేసి తల్పంపై ఊగుతూ:గిల్పం గిల్పం! ఆహాహా,ఓహోహో– కాలుమీద కాలువేసుకుని విలాసంగా ఆనందిస్తూ——స్వర్గం స్వర్గం! -- శర్మ,శాస్త్రి ఇంకా ఏ ఉపద్రవమూ జరగలేదని విడ్డూరంగా చూస్తూవుంటారు.

సారథి : గిల్పం గిల్పం! స్వర్గం స్వర్గం!——సదరు గిల్పం ఒరిగి సారథిని కింద పడవేస్తుంది. – సారథి తల్పంకింద దూరి బైటికివచ్చి చుట్టూతిరిగి పరికించి మంచంపై కూర్చుని . : ఇప్పుడు బాగుంది. –అనేలోగా గిల్పం గిర్రున తిరగడం మొదలెడుతుంది.

సారథి:అయ్యో అయ్యో–కూర్చున్న సారథి తలపై ఒక గొడుగు కర్రతోసహా దిగి తలపై మొట్టుతూవుంటుంది. శర్మ,శాస్త్రి అతనికి తగిన శాస్తి జరిగిందని సంబరపడతారు. (దుర్జనుల ఆనందం) చివరికి సారథి జారిపడి తిరుగుతున్న గిల్పం విసురుకి దొర్లివచ్చి శర్మ,శాస్త్రి పక్కన చేరుతాడు. (సన్నివేశ హాస్యానికి పరాకాష్ఠ) – శర్మ,శాస్త్రి అతడిని నిమురుతూ ...ఓమ్ శాంతి ఓమ్ శాంతి ఓమ్ శాంతి శాంతి ఓమ్ శాంతి శాంతి. విభూతి మంత్రించి బెదిరిపోయిన సారథి తలపై ఊదుతారు.

★★★

దుర్యోధనుడు, భానుమతి శకుని వద్దకు వస్తారు.

శకు: ఏం నాయనా.ఇప్పుడు వచ్చారు? – దుర్యోధనుడు భార్యవైపు చూపిస్తాడు.

భాను: ఏముంది? ఆ పెళ్ళికుమార్తెని చూసిన తర్వాత నాకేం తోచటం లేదు. ఈ పెళ్ళి మానుకుపోదామా అనిపిస్తోంది.

శకు దుర్యోధనునితో– చూశావా అదేనమ్మా శ్రీకృష్ణునిమాయ!మనం అసహ్యించుకుని మనంతట మనమే తిరిగిపోవాలని శశిరేఖచేత ఈ నటనంతా చేయించాడు. వారి మాయల్లో మనమా పడేది? ఆ మూడుముళ్ళూ పడనీయండి. తర్వాత అన్నీ చక్కబడతాయి. ఆఁ !

★★★

ఘటోత్కచుని మందిరంలో అంతటా ఆనందం నిండగా సుభద్ర, హిడింబ,శశిరేఖ , అభిమన్యుల ఎదుట ఘటోత్కచుడు: తెలుసుకదా మాతా. అక్కడ మూడుముళ్ళూ పడే ముహూర్తానికే ఇక్కడా మూడుముళ్ళూ పడాలని శ్రీకృష్ణులవారి ఆనతి.

సు: చిన్నన్నయ్య ఇక్కడ లేకుండానేనా?

ఘ: ఆ సందేహం వలదు మాతా .వారు ఇక్కడా ఉంటారు. అక్కడా ఉంటారు. చిద్విలాసులు. ఆం. ఇక నేను వెళ్ళి అక్కడ పెళ్ళి సర్వమంగళం కావించి,ఇక్కడ ఆశీర్వాదం వేళకు బలరామదేవుని బంధువర్గంతో సహా తోడితెస్తాను. మన ఆశ్రమం పావనం చేస్తాను మాతా.

హిడింబ : అలా చెయ్యరా సుపుత్రా. నేను మెచ్చుకుంటాను.

ఘ: నమో కృష్ణ నమో నమః. —ముందుకుపోయి మాయమౌతాడు.

★★★

ఉదయం ద్వారకలో కోట బురుజుపై బాకాలు. పెళ్ళివారు మంటపానికి తరలి వస్తారు. మాయాశశిని మహిళలు తోడ్కొని వస్తారు. ...ఆనందమానందమాయెనే; మన శశిరేఖ పెళ్లికూతురాయెనే...ఆనందమానందమాయెనే; మన శశిరేఖ పెళ్లికూతురాయెనే... పెళ్ళికొడుకు సహచరులతొ కలిసి వస్తాడు. పెళ్ళిపెద్దలు విలాసంగా ఆహ్వానిస్తారు. ..ఆనందమానందమాయెనే మన లక్ష్మణుడు పెళ్లికొడుకాయెనే... ..ఆనందమానందమాయెనే మన లక్ష్మణుడు పెళ్లికొడుకాయెనే... శ్రీకృష్ణుడు స్వయంగా దుష్టచతుష్టయాన్ని ఆహ్వానిస్తాడు. ...కౌరవులు యాదవులు వియ్యమందుచుండగా; కప్పురాలు వెదజల్లి సంబరాలు చెయ్యగా... పెళ్ళికుమార్తె, పెళ్ళికుమారుడు వేదికపైకి చేరుతారు.

★★★

అక్కడ ఘటోత్కచుని మందిరంలో శ్రీకృష్ణుని సమక్షంలో... ఆనందమానందమాయెనే మన అభిమన్యుడు పెళ్లికొడుకాయెనే... ఆనందమానందమాయెనే మన శశిరేఖ పెళ్లికూతురాయెనే...చిరునవ్వులు చిందిస్తూ శశిరేఖ , అభిమన్యులు ఇద్దరూ ఆనందంగా ఒకరినొకరు చూసుకుంటారు.

★★★

ద్వారకలో...నేపథ్యంలో... ధ్రువంతే రాజా వరుణో ... ఆగలేక తెరకిందికి నెట్టి చూడగా మాయా శశిరేఖ మెల్లకళ్ళతో వెక్కిరిస్తుంది. లక్ష్మణకుమారుడు బిత్తరపోతాడు. —పెళ్ళిపెద్దలు చేతిగుడ్డలు పంచిపెట్టగా "నాకు...నాకు" అని లేకిగా కేకలు. చిరాకుపడిన అభిమానధనుడు దుర్యోధనునితో లక్ష్మణకుమారుడుదుశ్శాసనుడు: "మన సోదరులు అన్నయ్యా".——శర్మ,శాస్త్రిల మద్దతుతో లక్ష్మణకుమారుడు "ఏవిఁటీ నిర్బంధం? తెర దించండి" .-

శర్మ: మీరలా అనరాదు. వారేమైనా అనుకుంటారు.

ల.కు: ఎవరేమనుకున్నాసరే. నేను పెళ్ళికుమారుణ్ణి. పెళ్ళికూఊతురిపై సర్వహక్కులూ నాకున్నాయి. తాతగారూ-నాన్నగారూ- తెరతీయించండి.

—శకుని లేచివచ్చి : ఏవిఁటి నాయనా?

లక్ష్మణకుమారుడు : మా వధూవరులమధ్య ఈ తెరేవిఁటి? తీయించండి. —సాత్యకి సహితుడైన బలరాముడు శ్రీ కృష్ణునితో: చిరంజీవి ఏవిఁటి అంటాడు?

శకుని: కమ్ముకుంటూ-- ఆం.ఏఁవీలేదు. మా ఆచారంలో ఇంతసేపు తెరపట్టడం లేదు.

శ్రీకృ: కాని మా ఇంట్లో మా ఆచారం జరపటం న్యాయమనుకుంటాను.

రెచ్చగొట్టబడిన రేవతి: కృష్ణా ఎవరింట్లోనైతేనేమి? వారి ఇష్టప్రకారమే జరగనివ్వండి.(కూతురు రారాజుకి కోడలుకావడం ఆమెకి ప్రధానం)

లక్ష్మణకుమారుడు : ఆఁ.అదే నేనూ అనేది. తెర తీసెయ్యండి.——అంటూ తానే ధాష్టీకంగా తెర తీసి పక్కకి విసిరేసి వెకిలిగా నవ్వుతాడు. సఅహచరులు లక్ష్మణకుమారుని అభినందిస్తారు.

దుశ్శా: భలే కర్ణా. మనవాడు మనపేరు నిలబెట్టాడు.

కర్ణుడు: నేనెప్పుడో చెప్పాను. మన చిరంజీవి తండ్రిని మించిన మానధనుడని.

దుఉర్యోధనుడు : కర్ణా. కృష్ణుని అవస్థచూస్తే జాలివేస్తోంది.

కర్ణుడు : అప్పుడే ఏమయింది? ముందున్నది ముసళ్ళ పండగ. (జరగబోయేది–యద్భావం– తద్భవతి!).

శకుని తన బృందాన్నిచేరి: మన ఆచారం ప్రకారం తదుపరి కార్యక్రమం కానివ్వండి.

పురోహితుడు: ముందు వధూవరుల పాదపీడనం, తదుపరి పాణిపీదనం జరగాలి.

లక్ష్మణకుమారుడు : శాస్త్రీ. పీడనమేమిటి?పీడ?

శాస్త్రి: తమరిప్పుడు వధూమణివారి ఎడమకాలి బొటనవేలిని తమ కుడికాలి బొటనవేలితో తొక్కాలి.

లక్ష్మణకుమారుడు .: అందుకు మేము సిద్ధమే.

శా: అమ్మాయిమణివారు అలా సిగ్గుపడకూడదు. తరువాత తాముకూడా అలాగే తొక్కాలి.

మాయా శశి : ఊఁ. ఆర్యపుత్రులకి కోపం వస్తే?

లక్ష్మణకుమారుడు : మాకెందుకు కోపం వస్తుందీ? మేమందుకు సిద్ధంగానే వున్నాం. –లేచి నిలబడతాడు. మంత్రాలహోరులో పళ్ళుబిగించి మాయా శశి కాలుతొక్కి ఆమె మొహంలో హావభావాలు గమనిస్తాడు. మాయా శశి సిగ్గు నటిస్తుంది. –

శర్మ: ఇప్పుడు అమ్మాయిమణివారు తొక్కాలి. (తెరపై ఘటోత్కచుని పాదం లక్ష్మణకుమారుడు పాదాన్ని నలిపేస్తుంది. ) లక్ష్మణకుమారుడు బాధతో పెడబొబ్బలు పెడతాడు. మాయా శశిరేఖ నవ్వుతుంది.

లక్ష్మణకుమారుడు విలవిల్లాడుతూ:చంపేశావు. చంపేశావు.

మాయా శశి :మరి ఆర్యపుత్రులు నన్ను తొక్కొచ్చునేం?

లక్ష్మణకుమారుడు :ఇక ఐపోయిందిగా? –తదుపరి లక్ష్మణకుమారుడు మాయా శశి చేతిని తన శక్తినంతా ఉపయోగించి నొక్కుతాడు.–మాయా శశి నవ్వుతూ ఉంటుంది. (లక్ష్మణకుమారుడు శశి బాధపడదేమిటి? అన్నట్లుగా అనుచరులవైపు చూస్తాడు.)

శర్మ: ఇక వధూమణివారి వంతు.

ల: అక్కర్లేదు.

పురోహితుడు: అట్లా అనకూడదు. మాయా శశి లక్ష్మణకుమారుడు చేతిని తన చేతిలోకి దొరకబుచ్చుకుని నొక్కుతుంది.(తెరపై ఘటోత్కచుని చెయ్యి లక్ష్మణకుమారుడు చేతిని పిండి పిప్పిచేస్తుంది) లక్ష్మణకుమారుడు విహ్వలంగా అరుస్తూ బలవంతాన తన చేతిని బాధతో వెనక్కి లాక్కుంటాడు .

లక్ష్మణకుమారుడు : అక్షింతలు వేస్తాను.

పురో: అక్షింతలు ఇప్పుడుకాదు. చివరలో. –బలరాముడు ప్రశ్నార్ధకంగా తమ్ముడు శ్రీకృష్ణునివైపు చూస్తాడు. (వెనక సాత్యకి నిలబడివుంటాడు.) శ్రీకృష్ణుడు చిద్విలాసంగా మందహాసం చిందిస్తాడు.

బలరాముడు :కృష్ణా. ఏఁవిటిదంతా?

శ్రీ.కృ: ఆఁ. ఈకాలపు పిల్లలు అంతేలెండి అన్నయ్యా. అల్లుడూ. లక్ష్మణకుమారా. అమ్మాయి బెదురుతూవుందికాని ఆ ముచ్చటేదో కాస్త నెమ్మదిగా జరిపించు నాయనా.

లక్ష్మణకుమారుడు –బింకంగా: బెదిరితే వీరపత్ని కాజాలదు. –దుష్ట చఅతుష్టయం. దుశ్శాసనుడు: భలే మామా భలే. మనవాడు కృష్ణునిపై చమత్కారబాణం వేశాడు. దుఉర్యోధనునితోసహా నలుగురూ ఆనందిస్తారు.

పురో: ఈ జీలకర్ర, బెల్లం అమ్మాయిమణివారి శిరస్సుపై ఉంచాలి.

ల: (అదేం బ్రహ్మవిద్యా? అన్నట్లుగా చూసి మాయా శశితలపై ఉంచబోతాడు. శశి స్థానంలో చింపంజీ భయంకరంగా ఉరకబోగా బెదిరి వెనక్కి తగ్గుతాడు. మళ్ళీచూస్తే మళ్ళీ చింపాంజీ. – లక్ష్మణకుమారుడు : కోతి కోతి– అని అరుస్తూ –నాన్నగారూ కోతి కోతి– అని తండ్రివద్దకు చేరుతాడు.

దుర్యో: లక్ష్మణా. ఏమిటిది?

లక్ష్మణకుమారుడు : కోతిపిల్ల.

శకు:ఏమిటి నాయనా?

ల: కోతి తాతా.——శకుని లక్ష్మణకుమారుని పెళ్ళి పీటలవద్దకి తీసుకుపోతాడు. దుర్యోధనుడుకూడా వెంటవస్తాడు. మాయా శశి విస్ఫారితనేత్రాలతో అమాయకంగా చూస్తుంది.

శకుని నవ్వుతూ:అహ్హహ్హ. నిక్షేపంలాంటి పిల్లని చూసి కోతంటావేమిటి నాయనా? నీ సరసానికి ఇదేనా సమయం?ఊఁ.కానీ… లక్ష్మణకుమారుడు శశివైపు భయం భయంగా చూస్తూ మళ్ళీ పెళ్ళిపీట ఎక్కుతాడు. ఆమె తలపై జీలకర్ర,బెల్లం ఉంచుతాడు.

★★★

అక్కడ ఘటోత్కచుని మందిరంలో శ్రీకృష్ణుని సమక్షంలో అభిమన్యుని. నిజ శశిరేఖల వివాహవేదిక. అదే ముహూర్తానికి అభిమన్యుడు నిజ శశిరేఖ తలపై జీలకర్ర, బెల్లం ఉంచి కూర్చుంటాడు. (సశేషం)

★★★

---

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments